సాక్షి అన్నమయ్య జిల్లా

బుధవారం ౹ 30 ౹ ఆగస్టు ౹ 2023



ప్రేమజంట ఆత్మహత్య

సూసైడ్‌నోట్ రాసిన విద్యార్థిని ప్రియుడితో కలిసి ఆత్మహత్యకు పాల్పడింది.ఈ సంఘటన పెద్దమండ్యం మండలంలోని నడిమిఒడ్డు వంక మొరవ వద్ద మంగళవారం జరిగింది. -8లో



డొంక కదులుతోంది?

వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో మహిళా సంఘాల లావాదేవీలు నిర్వహించే సంఘమిత్రల చేతివాటం వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.220	రూ.280
రెండోరకం	రూ.140	రూ.210

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 310 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	470	600
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 249.320 కిలోలు

న్యూస్‌రీల్

హెల్ప్‌డెస్క్ ఏర్పాటు

రాయచోటి అర్బన్: ఎంఐజి ఫేస్–2 దరఖాస్తు ఆన్‌లైన్ ప్రక్రియ నమోదు కోసం రాయచోటి మున్సిపల్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ గంగాప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వం మధ్యతరగతి కుటుంబాల కోసం మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ విభాగంలో హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేశామన్నారు. ఆన్‌లైన్ నమోదులో ఏవైనా సందేహాలు ఉంటే కార్యాలయం పనివేళల్లో ఉద్యోగులు సురేంద్ర – 9948586538, రెడ్డికుమార్ –9703216277 నంబర్లలో సంప్రదించా లని కోరారు.

కుష్టువ్యాధి నివారణకు చర్యలు



వైద్య సిబ్బందితో చర్చిస్తున్న డాక్టర్ శైలజ

రాయచోటిటౌన్: కుష్టువ్యాధి నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని కుష్టు వ్యాధి విభాగం జిల్లా అధికారి డాక్టర్ శైలజ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి ప్రభుత్వ ఆరోగ్యశాఖ కార్యాలయంలో వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో కుష్టు, క్షయవ్యాధి నివారణకు ప్రత్యేక ప్రణాళికను రూపొందించాలని చెప్పారు. వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ప్రాథమిక దశలో ఉన్నప్పుడు కుష్టు వ్యాధిని గుర్తిస్తే ఆరు నెలలు మందులు వాడితే తప్పకుండా నయం అవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పారా మెడికల్ అధికారి రవికుమార్, ఫిజియో థెరపిస్టు గుర్రప్ప, హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి దేవిప్రసాద్, డిప్యూటీ పారా మెడికల్ అధికారి శంభు ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

లక్కిరెడ్డిపల్లి: ఓటర్ల జాబితా ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని అన్నమయ్య జిల్లా డీఆర్ఓ సత్యనారాయణరావు పేర్కొన్నారు. మంగళవారం లక్కిరెడ్డిపల్లిలోని 15, 20 పోలింగ్ కేంద్రాలను, ఓటర్ల జాబితాను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2020, 2021వ సంవత్సరాల్లో రెండు ప్రాంతాల్లో ఓటు ఉన్న వారిని తొలగించి ఒక ప్రాంతంలో నియమించాలన్నారు. 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులకు ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి పోలింగ్ బూత్ వద్ద బీఎల్ఓలు పకడ్బందీగా జాబితాను తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రెడ్డన్న, ఆర్ఐ సమ్మత్ ఖాన్, వీఆర్ఓలు వెంకోజీ, బీఎల్ఓలు పాల్గొన్నారు.

ఆర్‌బీకే సిబ్బందికి శిక్షణ



మాట్లాడుతున్న చంద్రానాయక్

రాయచోటిటౌన్ : రాయచోటి వ్యవసాయ డివిజన్ పరిధిలోని రాయచోటి, చిన్నమండెం, టి. సుండుపల్లె, సంబేపల్లె మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో(ఆర్‌బీకే) విధులు నిర్వహిస్తున్న వ్యవసాయశాఖ అసిస్టెంట్లకు ఒక రోజు శిక్షణ నిర్వహించారు. రాయచోటిలో వ్యవసాయశాఖ జేడీ చంద్రానాయక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి సిబ్బందికి వివరించారు.ఖరీఫ్ 2023 సంవత్సరానికి సంబంధించి ఈ క్రాప్ బుకింగ్, ఫర్టిలైజర్ అమ్మకాలు ఎలా ఉన్నాయి..సప్లై ఎలా ఉంది.. ఇచ్చిన లక్ష్యాన్ని పూర్తి చేశారా అని అడిగి తెలుసుకున్నారు. పొలంబడి, డిజిటల్ అగ్రికల్చర్ గురించి వివరించి చెప్పారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప రూరల్: రెండేళ్ల మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్ (ఏఎన్ఎం) కోర్స్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. 2023–2024 విద్యా సంవత్సరానికి జిల్లాలో గుర్తింపు కలిగిన ప్రభుత్వ, ప్రైవేట్ ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఎఫ్) ట్రైనింగ్ సెంటర్స్‌లో గవర్నమెంట్ సీటు కోసం దరఖాస్తు చేయడానికి సీఎఫ్‌డబ్ల్యూ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్ సైట్‌ను చూడాలని పేర్కొన్నారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో డౌన్ లోడ్ చేసుకొన పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు విద్యార్హత పత్రాలను జత చేసి సెప్టెంబర్ 30వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

జీఎన్ఎం కోర్స్‌కు...

మూడేళ్ల జనరల్ నర్సింగ్ ,మిడ్ వైఫ్ (జీఎన్ఎం) కోర్స్‌కు సంబంధించి ప్రథమ సంవత్సరం ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. పూర్తి వివరాలకు డీఎంఈ.ఏపీ.ఎన్ఐసీ.ఐఎన్ వెబ్ సైట్‌ను సంప్రదించాలని ఆయన తెలిపారు.

దయచేసి వినండి..

- నందలూరు రైల్వేపై కదిలిన బోర్డు !
- నివేదికలు సిద్ధంచేయాలని దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు



రైల్వేబోర్డు చైర్మన్‌ను కలిసి నందలూరు రైల్వే గురించి విన్నవిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి (ఫైల్)



బ్రిటీషుకాలం నాటి స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఎత్తివేసినప్పటి దృశ్యం

రాజంపేట: బ్రిటీషు కాలం నుంచి వైభవంగా వెలుగొందిన నందలూరు రైల్వేకేంద్రం నీర్వర్యంగా మారుతున్న క్రమంలో రైల్వేబోర్డు దృష్టి దీనిపై పడింది. మంగళవారం అందిన సమాచారం మేరకు రైల్వేబోర్డు నుంచి నందలూరుకు సంబంధించి వివిధ అంశాలపై పరిశీలన చేసి, సమగ్ర నివేదికలు ఇవ్వాలని దక్షిణమధ్య రైల్వే అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈనెలలో రాజంపేట లోక్‌సభసభ్యుడు పీవీ మిథున్‌రెడ్డి రైల్వేబోర్డు చైర్మన్ అనిల్‌కుమార్ లోహిత్‌ను కలిసి నందలూరు రైల్వేకేంద్రం పూర్వవైభవం, ఇప్పుడున్న పరిస్థితుల గురించి వివరించారు. దీంతో నందలూరు రైల్వేకేంద్రం విషయంలో రైల్వే బోర్డులో ఎట్టకేలకు కదిలిక వచ్చింది.

ఒకప్పుడు ఇలా..

నందలూరులో 150 ఏళ్ల చరిత్ర కలిగిన స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్‌తో దక్షిణమధ్యరైల్వేలో ప్రత్యేక గుర్తింపు వచ్చింది.అప్పట్లో దేశంలోని వివిధ రాష్ట్రాలకు చెందిన చాలామంది ఉద్యోగులు, అధికారులు, కార్మికులు ఉండేవారు. అనుబంధంగా అనేక విభాగాలు ఉండేవి. పుష్కలంగా చెయ్యేరులోని నీరు లభ్యమయ్యేది. అధికారుల అతిథిగృహం, ఫోర్‌మెన్ బంగ్లా, కొత్తక్వార్టర్స్, నాగిరెడ్డిపల్లె, అరవపల్లె కార్మికుల క్వార్టర్స్, వందలాది ఎకరాల రైల్వే విస్తీర్ణం ఉండేది. రైల్వేస్కూల్, హెల్త్‌యూనిట్, టీఎక్స్ఆర్, ఎలక్ట్రికల్, క్రూసెంటర్, రైలింజిన్లకు నీరు నింపుకునే విభాగం ఉండేవి. సదరన్ రైల్వేలో ఉన్నప్పుడు నందలూరు– అరకోణం మధ్య రైళ్లు నడిచేవి. ఇక్కడే ప్యాసింజర్, ఎక్స్‌ప్రెస్ రైళ్లకు క్రూ ఉండేది. గూడ్స్‌రైళ్లకు క్రూ కొనసాగింది.

- నందలూరు రైల్వే లోకోషెడ్ స్థానంలో ప్రత్యామ్నాయ పరిశ్రమను ఏర్పాటుచేయాలనే డిమాండ్ దశాబ్దకాలం నుంచి వినిపిస్తోంది. రాజ్యసభలో అప్పటి రైల్వే మంత్రి లాలు ప్రసాద్ యాదవ్ వ్యాగిన్ రిపేర్ వర్క్ షాపు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. రాజ్యసభలో రికార్డులు పరిశీలిస్తే నిర్ధారణ అవుతుంది. రైల్వేబోర్డు, రైల్వేమంత్రిత్వశాఖలో నందలూరుకు పూర్వవైభవం కల్పించే దిశగా ఎంపీ కృషిచేశారు.
- రైల్వేబోర్డు, రైల్వే మంత్రిత్వశాఖ నందలూరుకు పూర్వవైభవం కల్పించే దిశగా అడుగులు వేయాలంటే అనుకూల నివేదిక రైల్వేబోర్డుకు చేరాలి. దీనికి సంబంధించి వాస్తవాలను నివేదించాలని రైల్వేబోర్డు సౌత్‌సెంట్రల్ రైల్వే అధికారులను ఆదేశించింది. డివిజన్ ఉన్నతాధికారులపై నందలూరు ప్రాంతీయుల్లో నమ్మకం లేదు. అందువల్ల నేరుగా సౌత్ సెంట్రల్ రైల్వే ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. ఇక్కడి వాస్తవాలను, రైల్వేకు ఉపయోగపడే స్థితి గతులను సేకరించడం వల్ల న్యాయం జరుగుతుందనే విశ్వాసం ఇక్కడి ప్రాంతీయుల్లో వినిపిస్తోంది. ఆ దిశగా జోనల్ అధికారులు నిర్ణయాలు తీసుకోవాలని కోరుతున్నారు.

మంచిపరిణామం



నందలూరు రైల్వేకేంద్రం విషయంలో రైల్వేబోర్డులో కదలిక రావడం మంచి పరిణామమే. ఇందుకు రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి కృషి అభినందనీయం. రైల్వే ప్రత్యామ్నాయ పరిశ్రమ ఏర్పాటు జరిగితే రాజంపేట పార్లమెంట్‌కు తలమానికంగా నిలుస్తుంది.

–మేడా రఘునాథ్‌రెడ్డి, అధినేత, ఎంఆర్‌కెఆర్ సంస్థ

దక్షిణమధ్య రైల్వే అధికారుల నివేదికతో న్యాయం



ద.మ.రైల్వే ఉన్నతాధికారుల అనుకూల నివేదికతో నందలూరుకు న్యాయం జరుగుతుందని మా న మ్మకం. గతంలో గుంతకల్ రైల్వే డివిజన్ ఉన్నతాధికారుల్లో కొందరి స్వార్థంతో తప్పుడు నివేదికలు వెళ్లేవని ప్రచారం ఉంది. నేరుగా రైల్వే బోర్డు వాస్తవాల పరిశీలనకు జోనల్ ఉన్నతాధికారిని పంపడమే మంచిది. –షేక్ మహమ్మద్ అలీ, మాజీ ఏజీపీ

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి

వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప సెవెన్‌రోడ్స్ : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సెప్టెంబర్ 2న జిల్లాలో పర్యటించే అవకాశం ఉందని.. అధికారులందరు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని వైఎస్సార్ జిల్లా కలెక్టర్ విజయ్ రామరాజు జిల్లా అధికారులను ఆదేశించారు. పర్యటనకు సంబంధించి ఇంకా అధికారికంగా మినిట్ టు మినిట్ అందాల్సి ఉందన్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో ముందస్తు ఏర్పాట్లపై ఎస్పీ అన్బురాజన్, జేసీ గణేష్ కుమార్, ట్రైనీ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, డీఆర్వో గంగాధర్ గౌడ్, పాడా ఓఎస్డీ అనిల్ కుమార్‌రెడ్డితోపాటు జిల్లా అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పర్యటనలో ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రణాళికా బద్ధంగా గట్టి ఏర్పాట్లు చేయాలని విధులను కేటాయించిన అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాల్లో ప్రొటోకాల్ ప్రకారం అన్ని ఏర్పాట్లు చేయడంతో పాటు.. పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాట్లు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. హెల్త్ క్యాంపులు, హెల్ప్ డెస్క్‌ను ఏర్పాటు చేయాలని వైద్య ఆరోగ్య శాఖాధికారులను ఆదేశించారు. హెలిప్యాడ్, బ్యారికేడింగ్ తదితర ఏర్పాట్లను ఆర్ అండ్ బి అధికారులు పటిష్ఠంగా చేపట్టాలన్నారు. కడప, జమ్మలమడుగు, పులివెందుల, ఆర్డీవోలు ధర్మచంద్రా రెడ్డి, శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, డీఆర్డీఏ పీడీ ఆనంద్ నాయక్, సీపీఓ వెంకటరావు, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ మహేశ్వర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



జాతీయ ఉత్తమ ఉపాధ్యాయుడు ఆంజనేయులును సన్మానిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి తదితరులు

రాయచోటి: రాయచోటి మాసాపేట ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆంజనేయులుకు జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం హర్షణీయమని ఎమ్మెల్యే జి.శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. మంగళవారం రాత్రి అవార్డు గ్రహీత రామాంజులు నివాసానికి ఎమ్మెల్యే వెళ్లి సత్కరించి పాదాభివందనం చేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ 32 ఏళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో ఉనన రామాంజులు సొంత డబ్బులు వ్యయం చేసి పాఠశాలలో ల్యాబ్ ఏర్పాటు చేసి విద్యార్థులకు పాఠాలను బోధించడం, మట్టితో పర్యావరణ అనుకూల వస్తువులను విద్యార్థుల చేత చేయించడం అభినందనీయం, ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, మార్కెట్ యార్డ్ కమిటీ చైర్మన్ వండాడి వెంకటేశ్వర్లు, జిల్లా మైనార్టీ అధ్యక్షుడు బేపారి మహమ్మద్‌ఖాన్, జిల్లా వ్యవసాయ సలహా సంఘ సభ్యుడు దిన్నెపాడు రవిరాజు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎర్త్‌సైన్స్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం పీజీ కళాశాలలో ఎంఎస్సీ ఎర్త్‌సైన్స్ విభాగంలో ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ అప్‌లెడ్ జియాలజీ కోర్సులో ప్రవేశాల కోసం రెండోవిడత ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వైవీయూ ఎర్త్‌సైన్స్ విభాగాధిపతి లక్ష్మీప్రసాద్ తెలిపారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు ఈ కోర్సులో ప్రవేశం పొందేందుకు అర్హులన్నారు. సెప్టెంబర్ 1వ తేదీ వరకు అవకాశం ఉందని తెలిపారు. విద్యార్థులు ఓఎండీసీ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8985597928, 9985442196 నెంబర్‌లో సంప్రదించాలని కోరారు.

తెలుగుభాషకు వెలుగు ప్రతీక ‘గిడుగు’



గిడుగురామ్మూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న జేసీ, కలెక్టరేట్ సిబ్బంది

రాయచోటి: వ్యవహారిక తెలుగుభాషకు వెలుగు గిడుగు రామ్మూర్తి అని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ కొనియాడారు. మంగళవారం కలెక్టరేట్‌లో గిడుగు రామ్మూర్తి జయంతి నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి చిత్రపటానికి జేసీ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. తెలుగు వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగురామ్మూర్తి అని జేసీ కొనియాడారు. తెలుగు భాషకు తొలి అడుగు గిడుగు రామ్మూర్తి అన్నారు. తెలుగుభాష ఉన్నంతవరకు గిడుగురామ్మూర్తి చిరస్మరణీయునిగా ఉంటారన్నారు. అనంతరం గిడుగురామ్మూర్తి చిత్రపటానికి కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, పర్యాటకశాఖ అధికారి నాగభూషణం, సమాచారశాఖ డీఐపీఆర్ఓ భరత్ కుమార్ రెడ్డి, కలెక్టరేట్ సిబ్బంది పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

తప్పులు లేని ఓటరు జాబితా తయారు చేయాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటిలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : అన్నమయ్య జిల్లాలో తప్పులు లేని ఓటరు జాబితా తయారీ లక్ష్యం కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ పేర్కొన్నారు. మంగళవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట, మార్కెట్, మేదరవీధులు, సంబేపల్లె మండలంలోని నారాయణరెడ్డిపల్లి పంచాయతీల్లో జిల్లా కలెక్టర్ ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో చిన్న పొరపాటు కూడా జరగకూడదని కింది స్థాయి అధికారులు బీఎల్ఓలకు కలెక్టర్ సూచించారు. తప్పులు లేని ఓటరు జాబితా రూపొందించడం వల్ల ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించవచ్చన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాయచోటి పట్టణంలోని పోలింగ్ స్టేషన్ నెం.129లో మంగళవీధి, నాదానవీధి, పోలింగ్‌స్టేషన్ 121 నందు నాయబ్‌సాబ్‌వీధి పోలింగ్ స్టేషన్ 158లో శివాలయం వీధులలో ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను నేరుగా పరిశీలించారు. డబుల్ ఎంట్రీ ఓటర్లు, చనిపోయిన వారి ఓట్లు, వలస వెళ్లిన వారి ఓట్లపై ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు చర్యలు తీసుకుంటామని ఆయా ఇంటి యజమానులకు తెలిపారు. ఇందుకు వారు సంతోషం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో రాయచోటి, సంబేపల్లె తహసీల్దార్‌లు ప్రేమంత్‌కుమార్, మహేశ్వరిబాయ్, ఎలక్షన్ డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, బీఎల్ఓలు రాధమ్మ, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా పరిశీలన

సంబేపల్లి: జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మంగళవారం సంబేపల్లె మండలంలో పర్యటించారు. మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ముద్దినేనివాండ్లపల్లెలో ఆయన ఓటరు జాబితాను ఇంటింటికి వెళ్లి పరిశీలించారు. పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఓటరు జాబితాలో ఎటువంటి చిన్న పొరపాటు కూడా జరగకూడదన్నారు. ప్రతి ఇంటికి బీఎల్ఓలు వచ్చి ఓటర్లకు సంబంధించిన సమస్యలు పరిష్కరిస్తున్నారా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మహేశ్వరిబాయ్, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ నరసింహులు, బీఎల్ఓలు రాధమ్మ, యుగంధర్, తదితరులు పాల్గొన్నారు.

భూసేకరణ వేగవంతం చేయాలి

రాయచోటి: మంగంపేట బైరైటీస్ ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రపంచంలోనే ప్రఖ్యాతిగాంచిన మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టుకు సంబంధించి ఆర్ అండ్ ఆర్‌కు ఎన్ని కోట్లు ఖర్చు చేశారు.. ఇప్పటి వరకు నష్టపరిహారం ఎంత ఇచ్చారనే వివరాలను కలెక్టర్ అడిగితెలుసుకున్నారు. మంగంపేట బెరైటీస్ ప్రాజెక్టు పరిధిలో ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని హద్దులు ఏర్పాటు చేయాలన్నారు. భూసేకరణకు సంబంధించి ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూడాలని ఏపీఎండీసీ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, రాజంపేట ఆర్డీఓ రామకృష్ణారెడ్డి, ఏపీఎండీసీ అధికారులు, ఓబులవారిపల్లి తహసీల్దార్ పీరుమున్నీ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థికి నిఘంటువు.. ఆంగ్లం ఇక సులువు



మదనపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో డిక్షనరీలతో విద్యార్థులు

నాడు తెదేపా ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు డిక్షనరీలు ఇవ్వలేదు. టీచర్ చెప్పినా.. బుక్ సెంటర్లలో రూ.300కు కొనుగోలు చేసేందుకు పేద విద్యార్థులు ఇబ్బంది పడ్డారు.

నేడు పాఠశాల తెరిచే రోజునే రాష్ట్ర ప్రభుత్వం జగనన్న విద్యా కానుకతోపాటు ఆక్స్‌ఫర్డ్ తెలుగు, ఆంగ్ల నిఘంటువును విద్యార్థులకు అందజేసింది. దీంతో ఆంగ్ల పదాలకు అర్థాలను సులువుగా తెలుసుకుంటున్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కానుక కింద ఉచితంగా పంపిణీ

మదనపల్లె సిటీ: ‘విద్యార్థులకు చదువే భవిష్యత్తు. భావితరాలకు ఆస్తి ఇస్తున్నామంటే అది చదువే’ అని సాక్షాత్తూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎప్పుడూ చెబుతున్న మాట. ప్రభుత్వ పాఠశాలలను గత ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో నీరుగారిపోయాయి.

నేడు ఆ పరిస్థితి మారింది. పాఠశాలల్లో ఆంగ్ల మాధ్యమం ప్రవేశ పెట్టిన ప్రభుత్వం అన్ని సౌకర్యాలు కల్పిస్తోంది. అన్నమయ్య జిల్లా 2213 ప్రభుత్వ పాఠశాలలు ఉండగా, ఈ ఏడాది జనగన్న విద్యా కానుక ద్వారా 17750 ఆంగ్ల డిక్షనరీలు ప్రభుత్వం పంపిణీ చేసింది. గతంలో విద్యార్థి ఆంగ్ల పదాలు అర్థంగాక ఇబ్బంది పడ్డారు. ఇపుడు డిక్షనరీలు ఇవ్వడంతో పట్టు సాధిస్తున్నారు. విద్యార్థులలో పఠనాసక్తి పెంచేందుకు డిక్షనరీలు ఎంతో ఉపయోగపడుతున్నాయని ఉపాధ్యాయులు చెబుతున్నారు.

ప్రత్యేకంగా రూపొందించారు



నాడు–నేడు కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ప్రత్యేకంగా డిక్షనరీలు రూపొందించారు. ఇది ఎంతో ప్రయోజనకరంగా ఉంది.ఉపాధ్యాయులు చెప్పే వాటిని విద్యార్థులు అర్థం చేసుకుంటూనే సొంతంగా తెలుసుకోవచ్చు. ఎక్కువకాలం గుర్తు ఉండిపోతాయి. పదాల ఉచ్ఛరణ తెలుస్తుంది.

– శ్రీరాం పురుషోత్తం, డిఈఓ, అన్నమయ్య జిల్లా

ఆంగ్లం అంటే భయం పోయింది



ఇప్పటి వరకు ఆంగ్ల పదాలకు సంబంధించి భయం ఉండేది. ఏదైనా సందేహం వస్తే ఉపాధ్యాయులను అడగలేక ఇబ్బంది పడ్డారు. ప్రభుత్వం అందించిన డిక్షనరీతో ఆయా పదాలకు అర్థం తెలుసుకుంటున్నారు. ప్రతి దాన్ని ఒకసారి రాయడం వల్ల బాగా గుర్తు ఉంటుంది. భయం పోయింది.

– జశ్వంత్, పదో తరగతి, జెడ్పీహెచ్ఎస్, మదనపల్లె

రాష్ట్ర ఉత్సవంగా మొల్లమాంబ జయంతి



కడప కల్చరల్ : తొలి తెలుగు రామాయణ కర్తగా పేరు గాంచిన మహా కవయిత్రి మొల్లమాంబ జన్మదినం మార్చి 13న ఇకపై రాష్ట్ర అధికారిక ఉత్సవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ సంచాలకులు పి.అర్జునరావు ఉత్తర్వులు జారీ చేశారు. కుమ్మర శాలివాహన సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించేలా ప్రభుత్వం ఆ శాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. తొలిసారిగా తెలుగులో రామాయణాన్ని తనదైన ముద్రతో రచించిన మొల్ల జయంతిని ఇకపై రాష్ట్ర ఉత్సవంగా నిర్వహించాలని కుమ్మర శాలివాహన సంక్షేమ అభివృద్ధి కార్పొరేషన్ ప్రతినిధులు పలుమార్లు విజ్ఞప్తి చేసిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశంపై జిల్లా వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వివాహిత ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న నాగవేణి (22)

లక్కిరెడ్డిపల్లి : మండ లంలోని కోనంపేట పంచాయతీలోని కె.వడ్డిపల్లికి చెందిన వివాహిత నాగవేణి (22) కడుపునొప్పి తాళలేక తమ ఇంట్లో ఉరి వే సుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. చక్రాయపేట మండలం కొండుగారిపల్లికి చెందిన ఓ వ్యక్తితో ఈమెకు మూడేళ్ల కిందట వివాహమైంది. ఇటీవల పుట్టినింటికి వచ్చిన ఆమె మంగళవారం ఈ అఘాయిత్యానికి పాల్పడింది.

అప్పుల బాధతో..


సుజాత (ఫైల్)

ఓబులవారిపల్లె : మండలంలోని గాదెల అరుంధతివాడ గ్రామంలో ఇరుగురి సుజాత(40) అనే వివాహిత మంగళవారం ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి బంధువుల కథనం మేరకు.. సుజాత భర్త చెంచురామయ్య తొమ్మిది సంవత్సరాలుగా గల్ఫ్ దేశంలో ఉన్నాడు. ఆయన ఇంటికి రాకపోవడం, అప్పులు ఎక్కువవడంతో సుజాత మనస్థాపానికి గురైంది. మంగళవారం సమీపంలోని పంట పొలాల వద్ద పురుగుల మందు తాగింది. హుటాహుటిన రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినా ఫలితం లేకపోయింది. మృతురాలికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు.

ఆర్టీపీపీ క్వార్టర్స్‌లో చోరీ

ఎర్రగుంట్ల : రాయలసీమ థర్మల్ పవర్ ప్రాజెక్టులోని సీ టైప్ క్వార్టర్స్ లైన్‌లో మంగళవారం భారీ చోరీ జరిగింది. రెండు ఇళ్లల్లో చోరీకి ప్రయత్నించిన దుండగులు ఒక ఇంటిలో దొరికిన 18 తులాల బంగారు నగలు తీసుకుని ఉడాయించారు. కలమల్ల పోలీసుల వివరాల మేరకు.. ఆర్టీపీపీ లోని సీటైప్-33 క్వార్టర్స్‌లో నివాసముండే ఈఈ ముడియం శ్రీనివాసులు తన సొంత పనిపై కాకినాడకు వెళ్లారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇ-టైపులోని రెండిళ్లలో చోరీకి ప్రయత్నించారు. ముడియం శ్రీనివాసులుకు చెందిన సీ-టైప్ 33లో బీరువా తాళం పగులగొట్టి 18 తులాల బంగారు నగలు దోచుకెళ్లారు. విషయం తెలుసుకున్న సీఐ సుదర్శన ప్రసాద్, ఎస్ఐ సంజీవరెడ్డి, డాగ్‌స్క్వాడ్ వచ్చి సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రేమజంట ఆత్మహత్య

- సారీ అమ్మా అని సూసైడ్‌నోట్ రాసిన విద్యార్థిని
- రెండు కుటుంబాలలో విషాదఛాయలు


చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ప్రేమజంట

పెద్దమండ్యం : 'సారీ అమ్మా.. ఆదిని నేను మరచిపోలేకున్నా.. ఆదికి సంబంధాలు చూస్తున్నారని తెలిసి నీకు చెబుదాం అనుకున్నా.. నీవు అర్థం చేసుకోలేవని తెలుసు మా.. నిన్ను హర్ట్ చేయడం నాకు ఇష్టం లేదు. మిమ్మల్ని మోసం చేయలేను మా.. ఒకరినొకరు వదిలి ఉండలేము.. సో మేము సూసైడ్ చేసుకోవాలని ఫిక్స్ అయినాము. ఐ యామ్ వెరీ సారీమా.. ఆది, నన్ను ఒకటే చోట పూడ్చి పెట్టండి ప్లీజ్.. మా కోసం మీరు ఏమీ గొడవలు పడవద్దు.. మీరు హ్యాపీగా ఉండండిమా.. నేను చేసిన తప్పుకు పనిష్మెంట్ ఇది'.. అంటూ సూసైడ్‌నోట్ రాసిన విద్యార్థిని ప్రియుడితో కలిసి తనువుచాలించింది. అన్నమయ్య జిల్లా పెద్దమండ్యం మండలంలోని పాపేపల్లె గ్రామం గొర్లవానికుంటకు సమీపంలోని నడిమిఒడ్డు వంక మొరవ వద్ద మంగళవారం ఈ సంఘటన జరిగింది. వివరాలిలా ఉన్నాయి.

గుర్రంకొండ మండలం సరిమడుగుకు చెందిన ఎలిశెట్టి సుబ్రమణ్యం కుమార్తె సౌమ్య (18) మదనపల్లెలోని ఒక ప్రవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరం చదువుతోంది. తల్లి మాధవి, తమ్ముడితో కలిసి ఇదే మండలంలోని ఎల్లుట్ల గ్రామం శీలంవారిపల్లెలో అమ్మమ్మ ఇంట్లో ఉంటోంది. కాగా, రాయచోటి మండలం యండపల్లె పంచాయతీలోని బాలిరెడ్డిగారిపల్లెకు చెందిన వేమల రామచంద్ర కుమారుడు సందీప్ అలియాస్ ఆది పెద్దమండ్యం మండలం కలిచెర్ల గ్రామంలోని బాటవారిపల్లెలో అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ పాల ఆటో నడిపేవాడు. ఈ క్రమంలో సౌమ్య, ఆదిల మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమగా మారింది. ఆది ఇటీవల ఆర్టీసీ ప్రైవేటు బస్సును మదనపల్లె-కడప మార్గంలో నడిపేవాడు. ఇదిలా ఉండగా, సోమవారం కళాశాల నుంచి శీలంవారిపల్లెకు వచ్చిన సౌమ్య పెద్దమండ్యంలోని తన పెద్దమ్మ ఇంటికి వెళ్లింది. అక్కడి నుంచి ఆమె ఆదితో ద్విచక్రవాహనంలో కలిసి వెళ్లింది. పాపేపల్లె - గోరాన్‌చెరువు మార్గంలోని గొర్లవానికుంటకు సమీపంలో రోడ్డుపై ద్విచక్రవాహనాన్ని నిలిపి సమీపంలోని కానుగచెట్టుకు ఇద్దరు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సంఘటనతో ఇరు కుటుంబాలలో విషాదం నెలకొంది. అటు ఉన్న ఒక్కగానొక్క కొడుకు మృతి చెందడంతో ఆది కుటుంబ సభ్యులు, ఇటు సౌమ్య కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా రోదించారు.

ఆడబిడ్డ చదువు కోసం కువైట్‌కు వెళ్లి..

సౌమ్య తల్లిదండ్రులు తనబిడ్డ చదువు కోసం తపనపడ్డారు. బిడ్డను బాగా చదివించాలని తల్లి మాధవి కువైట్‌కు వెళ్లింది. ఇటీవల స్వగ్రామానికి తిరిగి వచ్చి మళ్లీ కువైట్‌కు వెళ్లింది. అయితే తన కుమారుని అనారోగ్య కారణాలతో ఒకనెల మాత్రమే ఉండి తిరిగి స్వగ్రామానికి వచ్చింది. మదనపల్లెలో ఓ ప్రవేటు కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సరంలో కుమార్తె సౌమ్యను చేర్పించింది. అయితే అక్కడ ఉండటానికి ఇష్టం లేదని రాయచోటిలోని ఓ ప్రవేటు కళాశాలలో చేరతానని తల్లివెంట సోమవారం ఇంటికి వచ్చింది. తన పెద్దమ్మ దగ్గరికి పెద్దమండ్యం వెళ్లి ప్రియుడితో కలిసి అఘాయిత్యానికి పాల్పడింది. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సూసైడ్‌నోట్‌ను, విద్యార్థిని బ్యాగ్‌ను, ఇరువురి వద్ద ఉన్న సెల్‌లను స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం కోసం మృతదేహాలను మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఆ ఆస్పత్రిలోనే.. ఐదోసారి

ఆశ కార్యకర్త చొరవతో ప్రభుత్వ దవాఖానాలో సుఖ ప్రసవం


తల్లి మున్నీకి ఆరోగ్య శిశువును అందజేస్తున్న సంబేపల్లె సిబ్బంది

సంబేపల్లె : ఒకటి.. రెండు. కాదు.. ఏకంగా ఐదు ప్రసవాలను ప్రభుత్వ ఆస్పత్రిలోనే చేయించింది ఓ ఆశ కార్యకర్త. ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్య సేవలందవనే కారణంతో ప్రైవేటు ఆస్పత్రుల్లో చేరుతున్నవారి అభిప్రాయం తప్పని నిరూపించింది. వివరాలిలా ఉన్నాయి. సంబేపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి నిధులు కేటాయించడంతో «నాడు-నేడు» కింద తీర్చిదిద్దారు. ఇదే మండలం గున్నికుంట్ల పంచాయతీ జాండీగారిపల్లెకు చెందిన యాపశెట్టి మున్నీ ఆశా కార్యకర్త చంద్రకళ సాయంతో తొలి కాన్పు చేయించుకున్నారు. తల్లీ, బిడ్డ క్షేమంగా ఉండడంతో వరుసగా రెండు, మూడు, నాలుగు కాన్పులను అదే ఆస్పత్రిలో చేయించారు. సోమవారం తన ఐదో కాన్పు కోసం ఉదయం 11గంటలకు ప్రసవం కోసం ఆస్పత్రికి వచ్చారు. హైరిస్క్ జాబితాలో ఉండడంతో వైద్యుడు సూర్యనారాయణరెడ్డి సహకారంతో స్టాఫ్ నర్స్ గీతమ్మ, సిబ్బంది ఆమెకు సుఖప్రసవం చేశారు. సదరు మహిళ మగ శిశువుకు జన్మనిచ్చింది. వైద్య పరీక్షల నిమిత్తం రాయచోటి ఆసుపత్రికి తరలించారు. ఐదు కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రిలో నిర్వహించినా తల్లీ, బిడ్డ క్షేమగా ఉండడంతో ఆశ కార్యకర్తను అందరూ అభినందించారు. కాగా, తనను బాగా చూసుకున్నారని..ప్రతి నెలా 9వ తేదీన క్రమం తప్పకుండా పరీక్షలు చేస్తున్నారని మున్నీ సంతోషం వ్యక్తం చేసింది.

ఒంటిమిట్టలో స్థలాల పరిశీలన


మాడ వీధి విస్తరణకు అడ్డుగా ఉన్న గృహాలను పరిశీలిస్తున్న జేసీ

ఒంటిమిట్ట : ఆంధ్ర భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట కోదండ రామస్వామి ఆలయంలో మాడ వీధి విస్తరణకు అడ్డుగా ఉన్న కట్టడాలు, స్థలాలను జాయింట్ కలెక్టర్ జి.గణేష్ కుమార్ మంగళ వారం పరిశీలించారు. కొన్నేళ్లుగా అడ్డుగా ఉన్న ఇళ్లు, దక్షిణం వైపున ఖాళీ స్థలాలను ఆయన నిశితంగా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రామయ్య క్షేత్రం అభివృద్ధిలో భాగంగా కొన్ని ఇళ్లు, స్థలాలకు ప్రభుత్వం ఇదివరకే నష్టపరిహారం అందించిందన్నారు. క్షేత్రం అభివృద్ధికి అందరూ సహకరించాలని ఆయన కోరారు. ఆయన వెంట కడప ఆర్డీవో ధర్మారెడ్డి, ఒంటిమిట్ట తహసీల్దారు మాధవీలత, ఆలయ అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన

కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలో ప్రమాదాలు, విపత్తులను సమర్థంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన చర్యలను ప్రయోగాత్మకంగా వివరించి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని అదనపు ఎస్పీ కృష్టారావు, డిప్యూటీ చీఫ్ ఫ్యాక్టరీస్ ఇన్‌స్పెక్టర్ కృష్ణమూర్తి తెలిపారు. కడప నగర శివారులోని ఐఓసీఎల్ (ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్) బాటలింగ్ ప్లాంట్ ఆవరణలో డీజీఎం ధర్మారావు, సేఫ్టీ మేనేజర్ సునీల్ కుమార్ ఆధ్వర్యంలో మంగళవారం 'ఎమెర్జెన్సీ రెస్పాన్స్ డ్రిల్' కార్యక్రమం నిర్వహించారు. గ్యాస్ నిల్వచేసే ట్యాంకర్లలో మంటలు, ఇతర ప్రమాదాలు సంభవించినపుడు ఎలా ఛేదించాలనే అంశంపై ఎస్‌డీఆర్ఎఫ్, జిల్లా ఫైర్ సేఫ్టీ సిబ్బంది, రెస్క్యూ టీమ్ బలగాలు ప్రయోగాత్మకంగా చేసి వివరించారు. డిప్యూటీ తహసీల్దారు కేపీ. రొనాల్డ్ శ్యాముల్ రాజ్, కడప అగ్నిమాపక అధికారి బసివిరెడ్డి ఇతర అంశాలపై దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ ప్రదీప్, రిమ్స్ ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, ప్లాంట్ మేనేజర్లు సాంబశివరావు, జిలానీబాషా, మెడికల్ ఆఫీసర్ గోపీనాథ్, హెచ్‌పీసీఎల్ డిపో ఇన్‌ఛార్జి మన్మథరావు, సేఫ్టీ ఆఫీసర్ ప్రితీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విధి నిర్వహణకు పునరంకితం కావాలి

కడప సెవెన్‌రోడ్స్ : విధులను అంకిత భావంతో నిర్వర్తించేందుకు పునరంకితం కావాలని జేసీ గణేష్ కుమార్ అన్నారు. మంగళవారం జెడ్పీ ఆవరణలోని డీపీఆర్‌సీ భవనంలో పంచాయతీ కార్యదర్శుల పునశ్చరణ తరగతుల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఏపీ పంచాయతీరాజ్ చట్టం, ఉద్యోగుల విధి నిర్వహణ-క్రమశిక్షణా చర్యలు, ఉపాధి హామీ పథకం, లే అవుట్ల ఏర్పాటు-అమలు, సుస్థిరాభివృద్ధి లక్ష్యాల సాధన, జగనన్న శాశ్వత భూహక్కు వంటి అంశాలపై శిక్షణ ఉంటుందన్నారు. జిల్లాలో మొత్తం 528 మందికి గ్రేడ్-1నుంచి గ్రేడ్-5 వరకుగల పంచాయతీ కార్యదర్శులకు ఈ నెల 30వ తేదీ వరకు శిక్షణ ఇస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ సుధాకర్‌రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రెడ్డి, డీపీఓ కార్యాలయ ఏఓ ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు సత్వరమే రుణాలు

కడప అగ్రికల్చర్ : రైతులకు అన్ని రకాల రుణాలు సత్వరమే అందించాలని రాష్ట్ర ఉద్యాన శాఖ సలహాదారు సంబటూరు ప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. కడప డీసీసీ బ్యాంకు సీఈవో కందుల రాజేంద్రకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో రైతులు, ఖాతాదారుల సౌకర్యాలపై బ్యాంకర్లతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా సంబటూరు ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కొన్ని సహకార సంఘాల్లో అవసరానికి మించి డబ్బు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. డీసీసీ బ్యాంకు, ఆప్‌కాబ్ ఛైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణి మాట్లాడుతూ 30ఏళ్ల తర్వాత కడప డీసీసీ బ్యాంకు లాభాల బాట పట్టిందన్నారు. రాబోయే ఏడాది కచ్చితంగా డివిడెండ్ ఇస్తామన్నారు. సీఎం జగన్ మోహన్‌రెడ్డి సూచనతో చిన్న, మధ్య తరగతి రైతుల సౌలభ్యం కోసం రూ.8 లక్షల రుణాలకు మాత్రమే పది శాతం షేర్ క్యాపిటల్ తీసుకుంటున్నట్లు తెలిపారు. సీఈఓ కందుల రాజేంద్రకుమార్ మాట్లాడుతూ ఏవరైనా అవినీతికి పాల్పడితే 9966404211 నెంబర్‌కు కాల్ చేస్తే సిబ్బంది వివరాలను సేకరిస్తారన్నారు. నాబార్డు డిడిఎం విజయ విహారి, ఎల్‌డీఎం దుర్గాప్రసాద్ హాజరయ్యారు.

క్రీడల్లో వైద్య విద్యార్థులు రాణించడం అభినందనీయం

జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ


వైద్య విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న తుషార్ డూడీ, అధికారులు

కడప అర్బన్ : వైద్య విద్య అభ్యసిస్తున్న విద్యార్థులు క్రీడల్లోనూ రాణించడం అభినందనీయమని జిల్లా అదనపు ఎస్పీ(అడ్మిన్) తుషార్ డూడీ అన్నారు. జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా కడప ప్రభుత్వ వైద్య కళాశాల(రిమ్స్) ఆడిటోరియం వద్ద మంగళవారం 'స్పోర్ట్స్‌డే' ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన అదనపు ఎస్పీ తుషార్ డూడీకి కోలాటం, సంప్రదాయ నృత్యాలతో 2019 బ్యాచ్ వైద్య విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జరిగిన సమావేశంలో విద్యార్థులనుద్దేశించి తుషార్ డూడీ మాట్లాడుతూ మేజర్ ధ్యాన్‌చంద్ ఒలంపిక్స్‌లో హాకీ క్రీడలో మూడు పతకాలు సాధించి అందరికీ ఆదర్శంగా నిలిచారన్నారు. వైద్య విద్యతోపాటు, క్రీడల్లో ప్రతి ఒక్కరూ రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం అంతర్ జిల్లా కళాశాలలతో జరిగిన క్రికెట్, వాలీబాల్, ఇతర పోటీల్లో గెలుపొందిన వైద్య విద్యార్థులకు ట్రోఫీ, జ్ఞాపిక, ప్రశంసా పత్రాలను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజన వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎ.సురేఖ, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ శ్రీనివాసనాయక్, ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.సురేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. కడప రిమ్స్ సీఐ కె.రామచంద్ర, ఎస్ఐ ప్రతాప్‌రెడ్డి, రిమ్స్ శానిటేషన్ అండ్ సెక్యూరిటీ కాంట్రాక్టర్ జె.బాలనారాయణరెడ్డి, వైద్యులు, వైద్య విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

వరకట్నం కేసు నమోదు

ములకలచెరువు : సత్యసాయి జిల్లా తనకల్లుకు చెందిన ఎ.చంద్ర కుమార్తె శ్యామల, ములకలచెరువులోని వినాయక్‌నగర్‌కు చెందిన గంగిరెడ్డిపల్లి అనిల్‌కుమార్‌ను ఎనిమిది నెలల కిందట వివాహం చేసుకున్నారు. ఆరునెలల పాటు సజావుగా ఉన్న భర్త, అత్తామామలు రామప్ప, జయమ్మ కొన్నాళ్లుగా రూ.5 లక్షలు అదనపు కట్నం తీసుకురావాలని వేధిస్తున్నారు. డబ్బు తేలేదని ఆమెను ఇంట్లో నుంచి గెంటేశారు. ఈ మేరకు శ్యామల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

రామసముద్రంలో..


గాయాలు చూపుతున్న శ్రీజ

రామసముద్రం : తనను భర్త, అత్త, మామలు వేధిస్తున్నారని మండలంలోని రాగిమాకులపల్లె పంచాయతీ ఆర్.కొత్తూరు గ్రామానికి చెందిన శ్రీజ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డిపల్లె గ్రామానికి చెందిన శ్రీజ, ఆర్.కొత్తూరు గ్రామానికి చెందిన లోకేష్‌లకు మూడు నెలల కిందట వివాహమైంది. ఇటీవల భర్త, అత్తమామలు తనను ఇబ్బందులకు గురిచేసి కొడుతున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందరికీ కౌన్సిలింగ్ ఇస్తామని ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు.

ఇద్దరు ఆత్మహత్యాయత్నం

మదనపల్లె : కుటుంబ కలహాలతో ఇద్దరు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన మంగళవారం జరిగింది. బాధితుల కథనం మేరకు... మొలకలచెరువు మండలం ఏసువారిపల్లెకు చెందిన నారాయణ భార్య రాధ(38) కుటుంబ కలహాలతో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. అలాగే కలికిరి పట్టణం అమరనాథ్‌రెడ్డి కాలనీకి చెందిన పి.వెంకటమునీంద్ర(28) సోమవారం రాత్రి సీటీఎం క్రాస్‌లోని అత్తగారింటికి వచ్చాడు. అక్కడ భార్య శ్రీదేవితో ఘర్షణపడి పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. వీరిద్దరినీ వారి కుటుంబసభ్యులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు.

తీగ లాగితే డొంక కదులుతోంది?

- మండలంలోని ఒక సంఘమిత్రకు సంబంధించి రూ.6 లక్షల నిధులు దుర్వినియోగమైనట్లు ఆరోపణలు రావడంతో వాటిని దిగమించిన ఓ అధికారి ఈ నెల 3వ తేదీన చెక్కు రూపంలో రూ.3.20 లక్షలు జమ చేసినట్లు తెలిసింది.
- మండల కేంద్రానికి చెందిన ఓ మహిళ మండల సమాఖ్య నుంచి గ్రూపులకు నిధులు మళ్లించి మరో సభ్యురాలి పేరుతో రూ.1.50 లక్షల సొమ్మును గతంలో పని చేసిన అధికారి చేతికి ఇచ్చినట్లు తెలుస్తోంది.
- మహిళల ఆర్థికాభివృద్ధికి కృషి చేయాల్సిన అధికారులు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. వేల రూపాయలు సొంతానికి వినియోగించుకున్నట్లు ఆడిట్ లెక్కల్లో తేలడం ఇందుకు అద్దం పడుతోంది. తీగ లాగితే డొంక కదిలి వారి గుట్టురట్టయింది.



పెద్దతిప్పసముద్రం : వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయం పరిధిలో మహిళా సంఘాల లావాదేవీలు నిర్వహించే సంఘమిత్రల చేతివాటం, పక్కదారి పట్టిన నిధుల వ్యవహారం రోజుకో మలుపు తిరుగుతోంది. మండలంలో 34 గ్రామ సమాఖ్యలకు 37 మంది సంఘమిత్రలుగా వ్యవహరిస్తున్నారు. నాలుగు గ్రామ సమాఖ్యల్లో నిధులు గుట్టుగా పక్కదారి పట్టినట్లు సమాచారం. సంఘాల్లోని ఒక్కో సభ్యురాలికి రూ.50 వేల రుణం మంజూరు చేశారు. వీరు ప్రతినెలా సభ్యుల నుంచి రికవరీ నుంచి సొమ్ములో సగ భాగం జమ చేసి మిగిలిన సొమ్మును కాజేశారని తెలుస్తోంది. పట్టెంవాండ్లపల్లి, బూచిపల్లి, తుమ్మరకుంట, కందుకూరు, రంగసముద్రం, పులికల్లు, మరో మూడు గ్రామ సమాఖ్యల పరిధిలోనూ ఇదే విధంగా చేశారనే ఆరోపణలు దావనంలా వ్యాపించడంతో మహిళలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాక సదరు సంఘమిత్ర నిర్లక్ష్య ధోరణిపై గ్రామ సమాఖ్య పరిధిలోని 29 సంఘాల గ్రూపు సభ్యులంతా మూకుమ్మడిగా ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆమెను తొలగించి కొత్త వ్యక్తిని సంఘమిత్రగా నియమించినట్లు తెలుస్తోంది. ఆడిట్ అధికారులు సక్రమంగా తనిఖీలు చేస్తే మరిన్ని విషయాలు వెలుగు చూస్తాయని మహిళలు చెబుతున్నారు.

పెండింగ్ కేసులను వేగంగా పరిష్కరించాలి

నేర సమీక్షలో జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్



మహిళా సంరక్షణ కార్యదర్శికి ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ పోలీస్ అధికారులను ఆదేశించారు. నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలతో మంగళవారం నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాల దర్యాప్తు పూర్తిచేసి నిందితులపై ఛార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటుచేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డెకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. మహిళలు, బాలికల అదృశ్యం కేసులను విచారించి అదృశ్యమైన వారి ఆచూకీ తెలుసుకోవాలన్నారు. గంజాయి, రవాణా విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతో పాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. ఎస్‌హెచ్ఆర్‌సీ, ఎన్‌హెచ్ఆర్‌సీ ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు ఎస్పీ ప్రశంస

వివిధ కేటగిరీలలో అత్యుత్తమ సేవలందించిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ కేకేఎన్.అన్బురాజన్ ప్రశంసాపత్రాలు అందజేసి ప్రత్యేకంగా అభినందించారు. కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన నేర సమీక్ష కార్యక్రమంలో సాక్ష్యాధారాలతో నేర నిరూపణకు కృషి చేసిన పోలీసులు, స్పెషల్ బ్రాంచ్, కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బంది, బాల్య వివాహాలు అరికట్టిన మహిళా పోలీసులకు ఆయన ప్రశంసా పత్రాలు అందజేశారు.

అత్యాశ అనర్థదాయకం

సైబర్ నేరగాళ్లు అమాయకులను మోసగిస్తూ నగదు కాజేస్తున్నారని, ప్రజలు అప్రమత్తంగా వుండాలని జిల్లా ఎస్పీ కేకేఎన్. అన్బురాజన్ పేర్కొన్నారు. సైబర్ నేరాల నుంచి అప్రమత్తం చేసేందుకు ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. వాట్సాప్ కాల్స్ ద్వారా హనీ ట్రాప్ (న్యూడ్‌వీడియో కాల్స్ ద్వారా బ్లాక్ మెయిల్ చేసి రూ. లక్షలు డిమాండ్ చేయడం) చేసి ఇటీవలి కాలంలో అమాయకుల నుంచి రూ. లక్షల్లో డబ్బు డిమాండ్ చేస్తున్నారన్నారు. అపరిచితుల నుంచి వచ్చే వాట్సాప్ కాల్స్‌ను పట్టించుకోవద్దన్నారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్(ఎన్.సి.ఆర్.పి)లో అత్యధికంగా వాట్సాప్ కాల్స్ ద్వారా మోసపోయినట్లు ఫిర్యాదు చేస్తున్నారని జిల్లా ఎస్పీ తెలిపారు.

బహుమతుల పేరుతో..

ఆన్‌లైన్ షాపింగ్ లిమిటెడ్ పేరిట స్క్రాచ్ కార్డులంటూ మరింత మంది మోసం చేస్తున్నారని ఎస్పీ హెచ్చరించారు. తొలుత అమెజాన్, మీషో, నాప్తాల్ పేరిట సైబర్ నేరగాళ్లు మీ ఇంటికి కొరియర్ పోస్టు పంపుతారని, అనంతరం మీరు బహుమతి గెలుచుకున్నారని, తెలుసుకోవడం కోసం ఈ స్క్రాచ్ కార్డును స్క్రాచ్ చేయమని చెబుతారన్నారు. స్క్రాచ్ చేసి అందులో మీకు బహుమతిగా కారు, ఇతర లగ్జరీ వస్తువులు లాటరీ తగిలిందని చెబుతారన్నారు. అనంతరం ఫోన్ చేయాలని నెంబర్ ఇస్తారని, వాటికి కాల్ చేస్తే రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, డెలివరీ ఛార్జీలంటూ నగదు మొత్తం వసూలు చేస్తారన్నారు. కట్టిన తర్వాత సైబర్ నేరగాళ్లు మొబైల్ ఫోన్ స్విఛాఫ్ చేస్తారన్నారు. ఇలాంటి వాటి బారిన పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. బాధితులు వెంటనే ఎన్.సి.ఆర్.పి పోర్టల్‌లో ఫిర్యాదు చేసేందుకు 1930కు టోల్‌ఫ్రీ కాల్ చేయాలన్నారు.